# కర్నూలు | నంద్యాల వార్త

1 నవంబర్ 2022 | మంగళవారం | పేజీలు 4


అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రంమైన శ్రీశైలంలో వైభవంగా కార్తిక మాసోత్సవంలో కొనసాగుతున్నాయి.కార్తికమాసంలో మొదటి సోమవారమున భక్తులు వేకువజామున నుండే ఆలయాన్ని సందర్శిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకై దేవస్థానం పర్యవేక్షకులకు,ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించడం జరిగింది.కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న ఎప్పటికప్పుడు దర్శనం క్యూలైన్లను,ఆర్జితసేవ క్యూలైన్లను ఆలయ ప్రాంగాణాన్ని పరిశీలిస్తు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కార్తికమాసంలో ప్రభుత్వసెలవుదినాలు కార్తిక సోమవారాలు మరియు కార్తికా పౌర్ణమి రోజులలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకోవడం జరుగుతోంది.భక్తులందరు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది. వేకువజామున గం.3.00లకు ఆలయ ద్వారాలు తెరచి,ప్రాతకాల పూజల అనంతరం వేకువజామున గం.4.30ల నుంచి సాయంకాలం గం.4.00ల వరకు దర్శనాలు కల్పించబడ్డాయి.అదే విధంగా తిరిగి సాయంత్రం గం.5.30ల నుంచి రాత్రి గం.11.00ల వరకు దర్శనాలు కొనసాగాయి.

**శ్రీశైలంప్రాజెక్టు, అక్టోబర్31, ప్రభాతవార్త :** కార్తికమాసంలో సోమవారాలు, ప్రభుత్వ సెలవుదినాలు మొదలైన రద్దిరోజులలో (కార్తికమాసం మొత్తం 15రోజులపాటు) స్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలుపు దల చేయడం జరుగుతుంది. ఈ రద్ది రోజు లల్లో భక్తులకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది. ఈ రద్దిరోజులలో సామూహిక అభిషేక సేవాకర్తలకు కూడా అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుంది. అదే విధంగా రద్దిరోజులలో గర్భాలయ అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేయబడుతాయి. ఉదయాస్తమానసేవ మరియు ప్రదో శకాలసేవకర్తలకు మాత్రం ఆయాసేవల ని న్నంటిని జరిపించే అవకాశం కల్పించబ డింది. ఈ సేవలకు పరిమితంగానే అనగా రోజుకు ఒక్కొక్క సేవకు 6 టికెట్లు మాత్రమే ఇస్తున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది.

కార్తి కమాసమంతా క్యూకాంప్లేక్స్ లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పా హరం, బిస్కెట్లు మరియు మంచినీరు అందజేయబడుతున్నాయి. ఉదయం వేళలలో పాలు కూడా అందజేయబడుతున్నాయి.

**కార్తికదీపోత్స వం:** భక్తులు కార్తికదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడ శివవీది మరియు గంగాధరమండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది.

**లడ్డుప్రసాదాలు:** కార్తికమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యాలో లడ్డు ప్రసాదాలు సిద్దం చేయబడ్డాయి. మొత్తం 9 కౌంటర్లు ద్వారా ఈ లడ్డు ప్రసాదాలు విక్రయించబడుతున్నాయి.







# వైభవంగా.. కార్తీకమాసోత్సవాలు..!

శ్రీశైలక్షేత్రంలో కార్తిక మొదటి సోమవారం సందర్బంగా పుష్కరిణి వద్ద దేవస్థానం లక్షదీపోత్సవం మరియు పుష్కరిణిహారతిని నిర్వహించడం జరిగింది. లోక కల్యాణం కొసం ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. కార్తికమాసంలో ప్రతి సోమవారం (మొత్తం 4 సోమవారాలు) మరియు కార్తిక పౌర్ణమి రోజున కూడా ఈ కార్యక్రమాలు జరిపించబడుతాయి.కాగా ఈ ఏడాది రెండవ సోమవారం నాటి సాయంకాలానికే పౌర్ణమి ఘడియలు రానున్నాయి.

ఈ దీపోత్సవ కార్యక్రమంలో పుష్కరిణి ప్రాంగణమంతా కూడా దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది. కార్తికమాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యముంది. ఈ మాసంలో దీపారాధననే కాకుండా దీపదర్శనం కూడా ఎంతో పుణ్యదాయకమని పురాణాలు చెబుతున్నాయి. కార్తిక దీపదర్శన వలన జాతిబేదం లేకుండా మానవులందరికి, ఇంకా పక్షులు, కీటాకాలు, జల చరాలు మొదలైన వాటికి, ఇంకా వృక్షాలను కూడా పునర్జన్మ ఉండదని పురాణాలు చెబుతారు.

శ్రీశైలం ప్రాజెక్టు, ప్రభాతవార్త :





# లక్షదీపోత్సవం..!





# నట్టేట ముంచిన పత్తి సీడ్స్..!

- పత్తి సీడ్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి
- రోడ్డుపై పత్తి మొక్కలతో ధర్నా చేపట్టిన రైతులు
- భువనేశ్వరి సీడ్స్ షాప్ ముందు రైతుల ధర్నా
- సీఐ విక్రమ్‌సింహ జోక్యంతో ధర్నా విరమించిన రైతులు

**ఆదోనిటౌన్ / ఆదోని రూరల్ అక్టోబర్31, ప్రభాతవార్త ;** ఆదోని పట్టణంలోని భువనేశ్వరి సీడ్స్ షాపు ముందు మండలానికి చెందిన వందలాది మంది రైతులు ధర్నాకు దిగారు. పత్తి చెట్లతో రోడ్డుపై రైతులు బైఠాయించి నిరసన తెలియజేశారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని భారీ ఎత్తున రైతులు ధర్నా చేపట్టారు. గంటపాటు వాహనాల రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. తమకు ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అకిరా, మహావీర్, ఓంసాయి తదితర పత్తి విత్తనాల ప్యాకెట్లను మంచి దిగుబడి వస్తుందని అమ్మారని, తీరా చూస్తే కనీసం చెట్టుకు కాపు నిలబడలేదని, వీరు ఇచ్చిన విత్తనాల వల్ల మోసపో యామని, అప్పుల్లో కూరుకుపో యామని అక్కడికి వచ్చిన గ్రామాల రైతులు వాపోయారు. పైగా రెండు రెట్లు రెట్టింపు ధరకు అమ్మి మమ్మల్ని మోసం చేశారని తెలిపారు. తీరా భువనేశ్వరి దుకాణం యాజమానిని నిలదీసేత మాకు సంబంధంలేదు. వెళ్లి కంపెనీతో అడగండి, లేదా ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, వెళ్లి తీసుకోండి అని రైతులను కించపరిచే విధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నకిలీ విత్తనాలను నకిలీ మందులను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు కూడా షాపు యాజమానులకే ఒత్తాసు పలుకుతుండడం చూస్తుంటే షాపు యజమానులకు సంబంధిత వ్యవసాయ అధికారులకు మధ్య ఎంతవరకు లావాదేవీలు వ్యవహారం నడిచిందో వారి మాటలువింటేనే అర్థమవతుందన్నారు. కనీసం నకిలీ విత్తనాలు ఎందుకు అమ్మారు? విత్తనాలను అమ్మేటప్పుడు ఎక్కువ ధరకు ఎందుకు అన్నారు... అని సంబంధిత వ్యవసాయ అధికారి దుకాణ యజమానులను అడుగకపోగారతులనే దబాయిస్తూ ఎక్కువ ధరకు అమ్మేటప్పుడు నాకెందుకు ఫిర్యాదు చేయలేదు అని మీకు నష్టపరిహారం కావాలంటే



కంపెనీ దగ్గరికి వెళ్లి మాట్లాడుకోండి అని బహిరంగంగా అనడం చూస్తుంటే ప్రజల కోసం ఎంతవరకు వ్యవసాయ శాఖ అధికారులు కష్టపడి పనిచేస్తున్నారో అక్కడ ఉన్న రైతులు అవాక్కయ్యేలా ఉంది. ప్రతి సంవత్సరం అన్ని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్నామని వారు ఎలాంటి నకిలీ విత్తనాలు అమ్మడం లేదని, ఫర్టిలైజర్ షాపు యజమానులకు మద్దతుగా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు మాకు ఎలాంటి ఫిర్యాదు లేదని తెలపడం వెనుక ఆయన మనసులో ఫర్టిలైజర్ షాపు యజమానులపై ఉన్న ప్రేమను తెలపకనే తెలుపుతున్నట్లు అనిపిస్తుంది. అక్కడికొచ్చిన రైతులు ఫర్టిలైజఱ షాపుల యజమానులు అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపినా ఫర్టిలైజర్ షాపు యజమానులు కూడా అవును మేము రూ.750 అమ్మాల్ని పత్తి విత్తనాల ప్యాకెట్‌ను రూ.1400కు పైగా విక్రయించాము అని బహిరంగంగా మాట్లాడుతున్నారన్నారు. ఏదేమైనా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని రైతులు వాపోయారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో అక్కడికి ఆదోని వన్‌టౌన్ సీఐ విక్రమ్‌సింహ చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. పోలీసులు జోక్యంతో రైతులు ధర్నా విరమించారు. పత్తి విత్తనాల కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

# జాతీయ సమైక్యత పరుగును జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ

**కర్నూలుక్రైమ్, అక్టోబర్,31, ప్రభాతవార్త ః** దేశ సమగ్రత ఐక్యతకు కృషి చేసిన స్వతంత్ర్య సమర యోదుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఏక్తా దివస్ ను పురస్కరించుకుకొని దేశ ఐక్యమత్యాన్ని చాటుతూ ఏక్తా రన్ కార్యక్రమాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్ కౌశల్ జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం సర్దార్ వల ్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను కర్నూలులో ఘనంగా నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కొండారెడ్డి బురుజు నుండి ఏక్తా రన్ ప్రారంభమై రాజ్ విహార్ కూడలి వరకు భారీ ర్యాలీగా కొనసాగింది. పటేల్ జయంతి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్స వాల చివరి రోజు సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ ఏక్తా రన్ ను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. అనంతరం రాజ్ విహార్ కూడలిలో సివిల్ ఎఆర్ ఎపిఎస్పీ సిబ్బంది క్రీడాకారులు ఎన్‌సిసి విద్యార్థులచే ఎఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు జాతీయ సమైఖ్యతా ప్రతిజ్ఞ ను ఈ క్రింది విధంగా పలికిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐమత్యం సమగ్రత భద్రతను కాపాడడానికి స్వయంగా అంకితమవుతామని అంతేగాక ఈ సందేశాన్ని తోటివారందరిలో విస్తరింపచేయడానికి గట్టిగా కృషి చేస్తానని సత్యనిష్టతో ప్రతిజ్ఞ చేస్తున్నాను. సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క దార్శనికత చర్యల వల్ల లభ్యమైన నా దేశ ఏకీకరణ స్ఫూర్తితో నా దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటు అందిస్తామని సత్యనిష్టతో తీర్మానం చేస్తున్నాట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్ అడిషనల్ ఎస్పీలు డి ప్రసాద్ నాగబాబు డిఎస్పీలు కెవి మహేష్ ఇతియాజ్ బాషా రవీంద్రారెడ్డి పోలీసు వేల్ఫేర్ డాక్టర్ స్రవంతి సిఐలు ఆర్ ఐలు ఎస్సైలు ఆర్ ఎస్సైలు ఆర్మ్డ్ సివిల్ ఎపిఎస్పీ పోలీసు సిబ్బంది ఎస్ సిసి విద్యార్థులు క్రీడాకారులు యువత తదితరులు పాల్గోన్నారు.




# మహానంది క్షేత్రంలో.. భక్తుల రద్దీ..!



**మహానంది, అక్టోబరు 31, ప్రభాతవార్తః** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర భంగా క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి అమ్మవారి దర్శనార్థం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ముందుగా కోనేరులలో పుణ్యస్నానాలు అచరించి కార్తీక దీపాలు వెలిగించి స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. క్షేత్రానికి భక్తుల రదీ ్ద దృష్ట్యా ఇఓ చంద్రశేఖర్‌రెడ్డి భక్తులకు ఎలాంటి అసౌక ర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. క్షే త్రంలో సామూహిక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. కార్తీకమాసం మొదటి సోమవారం ఈకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివారికి పల్లకీ ఉత్స వం నిర్వహించారు. ముందుగా పూజాకార్యక్రమంలో ఆలయ ఇఓ దంపతులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలోని మొదటి ప్రాకారంలో పల్లకీ ఉత్స వం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనా ్నరు. సాయంకాలం భజనబృందం వారి ఆధ్వర యంలో భక్తిపాటలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.



# రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యం..!

**- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం**

**హాలహర్వి, అక్టోబరు 31, ప్రభాతవార్త :** రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం మండల పరిధిలోని జె వాసల్లి గ్రామంలో మంత్రి గుమ్మనూరు జయరాం, వైసిపి ఆలూరు ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వ ర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే ఆ సమస్యలపై అధికారులకు వివరించి సమస్యలను పరిష్కరించడం జరిగింది. అనంతరం ప్రజల సమస్యల్లో భాగంగా ఆ గ్రామానికి తాగునీరు సమస్య ఎక్కువగా ఉండటం వల్ల ఆ గ్రామానికి తాగునీటి సమస్య తీర్చేందుకు బాపురం ఎల్ఎల్‌సి కెనాల్ నుండి రూ.15లక్షల ఖర్చుతో తాగునీటి పైప్‌లైన్ వేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. జైవాసల్లి గ్రామాభి వృద్ధికి రూ.13కోట్ల30లక్షల నిధులు మంజూరయ్యా యన్నారు. గ్రామంలో చాలాచోట్ల గుడిసెలు ఉన్నాయని కనుక వారికి ఇళ్లు నిర్మించుకోవడానికి ఆ గ్రామానికి హౌసింగ్ స్కీం కింద రూ.7కోట్ల98లు, సచివాలయానికి రూ.40లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.20లక్షలు, సంక్షేమ పథకాలకు రూ.4కోట్ల71లక్షలు మొత్తం రూ.13కోట్ల 30లక్షల నిధులు మంజూరయ్యాయని మంత్రి జయరాం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంటోని, తహశీల్దార్ మల్లికార్జున, జడ్‌పిటిసి లింగప్ప, ఎంపిపి నెట్టికంట, ఎస్ఐ విజయ్‌కుమార్, టమ్మా తిప్పాయి స్వామి, సొసైటీ చైర్మన్ సీనప్ప, హాలహర్వి, ఆలూరు వైసిపి మండల కన్వినర్లు భీమవ్వ చౌదరి, వీరేష్, హనుమంత రెడ్డి, సర్పంచ్ నాగేంద్ర, సర్పంచ్ ఉలిగమ్మ, రాజశేఖర్, విరుపాక్షి, దుబ్బలింగ, బసవరాజు, సచివాలయ, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



# దేశాభివృద్ధి కోసం మనమంతా ఒక్కటే : కలెక్టర్

**: జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి**

**కర్నూలు, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** దేశాభివృద్ధి కోసం మనమంతా ఒక్కటే అనే సమైక్య భావంతో మెలగాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు పౌరులకు విజ్ఞప్తి చేశారు కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంగణంలో స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు నగర మేయర్ బి.వై.రామయ్య, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ, సెట్కూరు సీ.ఈ.ఓ రమణ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ - సెట్కూర్ కర్నూలు వారి ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్స వం సందర్భంగా సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన 2కే రన్ ను ప్రారంభించి, రన్ లో పాల్గొన్నారు.. రన్ లో ఎన్ సి సి కేడెట్లు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి హోం శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని కొనియాడారు. నేడు ఆయన 147వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జయంతి వేడుకలను నిర్వహించు కుంటున్నామన్నారు.. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడిగానే కాకుండా స్వాతంత్ర్యానంతరం పలు సంస్థానాలు భారతదేశములో విలీనం చేసిన ఘనత వీరికి దక్కుతుందన్నారు. దేశం అంతా ఒక్కటే, భారతీయులంతా ఒకటిగా ఉంటామంటూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రజల్లో ఐక్యత భావాన్ని నూరి పోశారని వివరించారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలోనూ ప్రజల్లో ఐక్యత భావాన్ని నింపిన గొప్ప వ్యక్తిగా కలెక్టర్ అభివర్ణించారు. దేశ ప్రజలంతా కలిసి మెలగాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అభినందనీయమని పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు నగర మేయర్ బి.వై.రామయ్య, కమీషనర్ భార్గవ్ తేజ పేర్కొన్నారు... ప్రజలలో జాతీయ భావాన్ని నింపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి కార్యక్రమాలు జరపడం సంతోషదాయకమన్నారు. భారతీయలంతా ఒక్కటే, మనమంతా కలిసి జాతి సమైక్యతకు కృషి చేద్దామని వారు పిలుపు నిచ్చారు




# సరైన నాయకుడిని ఎన్నుకోకపోతే నష్టపోతారు - టీజీ భరత్



**కల్లూరు, అక్టోబర్31, ప్రభాతవార్త:** తెలుగుదేశం ప్రభుత్వానికి వైసీపీ ప్రభుత్వానికి తేడా ఏంటో తెలుసుకోవాలని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ ప్రజలకు సూచించారు. సోమవారం నగరంలోని 16వ వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమంతోపాటు ఒకరోజు అన్నక్యాంటీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలుసునన్నారు. పేదవారికి ఎంతో ఉపయోగపడే అన్నక్యాంటీన్లను కొనసాగించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల సమయంలో సరైన నేతను ఎన్నుకోకపోతే ఐదు సంవత్స రాలు నష్టపోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమన్నారు. జగన్ పేరు చెబితేనే ప్రజలు భీ కొడుతున్నరన్నారు. కర్నూలులో టీజీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డు కార్పొరేటర్ విజయకుమారి, వార్డు ఇన్‌చార్జ్ రామాంజనేయులు, నగర అధ్యక్షులు గున్న మార్క్, క్లస్టర్ ఇన్‌చార్జ్ బాబ్జీ, ఇతర వార్డు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తదితర నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు మెడికల్ కాలేజి నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. టీజీ భరత్ బైక్ ర్యాలీలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ వచ్చారు.

# పటేల్‌ను అదర్శంగా తీసుకోవాలి

**నంద్యాల క్రైం, అక్టోబరు 31, ప్రభాతవార్తః** ప్రపంచ దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో భిన్నత ్వంలో ఏకత్వం అనే సిద్ధాంతంపై అనేక రక రకాల జాతులను అంత టిని ఏకధాటిపైకి తీసుకువచ్చిన మహానుభావుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషలు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని రన్‌ఫర్ యూనిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, డిఎస్పీ మహే శ్వర్‌రెడ్డిలు రన్‌ఫర్ యూనిట్‌ను ప్రారంభించారు. సా ్థనిక ఎస్పీజి స్కూల్ నుంచి ప్రారంభమై వైజంక్షన్, మున్సిపల్ అఫీసు, పద్మావతీనగర్ మీదుగా మార్కెట్ యార్డు చేరుకుంది. అక్కడ సర్దా ్దర్ వల్లభాయ్ పటేల్‌కు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశపు ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని గుర్తుచేశారు. 1875 అక్టోబరు 31న గుజరాత్‌లోని నాడియార్‌లో జన్మించారని ప్రముఖ స్వాతంత్ర్య యోధుడుగానే కాకుండా స్వాతంత్ర్య అనంతరం స ంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి కృషిచేసిన సఫలికుడిగా ప్రముఖుడిగా పేరుపొం దారన్నారు. నేటి యువత పటేల్ యొక్క జీవిత విశేషాలను అదర్శంగా తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలు కాపాడుకుంటూ అహింసా



సిద్ధాంతాలతో ముందుకు నడవాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రం దేశాభివృద్ధికి పాటుపడాలని ప్రపంచ దేశాల్లో అగ్రగామి దేశంలోతీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరు పాటుపడాలన్నారు. అడిషనల్ ఎస్పీ రమణ మాట్లాడుతూ స్వాత ంత్ర్యం వచ్చిన తరువాత 50 నుంచి 60 సంస్థానాలను వారికి ఇష్టం వచ్చినట్లుగా నచ్చేదేశంలో కలువవచ్చని పత్రాన్ని విడుదల చేసి స్వతంత్ర్యాన్ని ప్రకటించారని తెలిపారు. పటేల్ డిపూ ్యటి పిఎం, హోం మినిస్టర్‌గా పదవులు అలంకరించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పార్థుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిధరఖాస్తుకు ఎండార్స్‌మెంటు ఉండాలి

**– లబ్ధిదారులు సంతృప్తి చెందాలి :స్పందనలో జిల్లా కలెక్టరు**



**నంద్యాల, అక్టోబరు 31, ప్రభాతవార్తః**

స్పందన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతే ్యక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటినరీహాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కోసం జిల్లా జేసి నారపురెడ్డి మౌర్యతో కలిసి జిల్లా నలుమూలల నుంచివచ్చిన అర్జీదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్జీలను గడువులోగ నాణ్యతతో పరిష్కరిచండంతో పాటు క్షేత్రసా ్థయి పోటోలను స్పందన పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టరు అదేశించారు. ప్రతి ధరఖాస్తుకు ప్రాపర్ ఎండార్స్ మెంట్ ఇవ్వడంతో పాటు స్పీకింగ్ అర్డర్స్ ఇవ్వాలన్నారు. ధరఖాసు ్తలను మొక్కుబడి రీతిలో మూసియేయకుండా ఖచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 88 రి ఒపెన్ కేసులు వితిన్ ఎస్ఎల్ఎలో ఉన్న 826 సర్వీసులు దరఖాస్తులన్నిటిని క్లియర్ చేయాలని అధికారులను అదేశించారు. కోర్టుకు సంబంధించి కేసులకు కౌంటరు ఫైల్ దాఖలు చేయాలని సూచించారు.వార్త పత్రికల్లో ప్రతిరోజు వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి ఏరోజుకారోజు టెకెన్ రిపోర్టుతో పాటు రిజాయిండర్ల పంపాలని సంబంధిత అధికారులను కలెక్టరు అదేశించారు. ప్రజాసమస్యల్లో కొన్ని వినతులు నందికోట్కూరు మున్సిపాలిటి పరిధిలోని ఎబిఎం పాలెం నివాసి చిన్ననారాయణ, దామగట్ల రెవిన్యూ గ్రామంలోని సర్వేనం.109/1లో 4.61 ఎకరాల వీస్తీర్ణం ఉందని దీనికి సమీపంలో మున్సిపాలిటి డంపింగ్ యార్డు నిర్మించాలనే ప్రతిపాదన ఉందని నాపొలం వద్దకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. బనగానపల్లె 1వ వార్డు నివాసి బానుముక్కల వరమయ్య తాను నివసిస్తున్న ప్రాంతంలో పబ్లిక్ కుళాయి పైపు విరిగిపోయి నీరు సంవత ్స రాంతంగా వృదాగా పోతుందిన ఏ అధికారి పట్టించుకోవడం లేదని కాలనీవాసులకు తాగునీరు ఇబ్బందిగా ఉందని తెలిపారు. కొత్తపల్లె మండలం మాదుగుల చెంచుగూడెంలో కృష్ణనది బ్యాక్ వాటర్ మూలంగా పూర్తిగా మునిగిపోయిందని 23 సంవత ్సరాలు క్రితం ఇళ్ల నిర్మాణాలు చేస్తామని హామి ఇచ్చి కట్టించలేదని తెలిపారు.పాణ్యం మండలం భూపనపాడు నివాసి బాలస్వామి తన కాలు విరిగిపోయిందని సదరం క్యాంపులో వికలాంగ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. 340 మంది అర్జీదా రులు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎండార్స్ చేశారు.

## సాధారణంగా కౌన్సిల్ సమావేశం

**ఎమ్మిగనూరు అక్టోబర్ 31 ప్రభాతవార్త:** మునిసిపల్ సర్వసాధారణ సమావేశం సోమవారం మునిసిపల్ కార్యలయంలో జరిగింది, 33 అంశాలు పెట్టగా అందులో 32 అంశాలు ఆమోదం తెలిపి, ఒక్క అంశాన్ని వాయిదా వేశారు. వాయిదా వేసిన అంశం పై టిడిపి కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేస్తూ గతంలో కూడ ఈ అంశాన్ని మూడు సార్లు వాయిదా వేశారాన్నారు. వాయిదా వేసిన అంశంలో మునిసిపాలిటీకి చెందిన 22 దుకాణల లీజు విషయం పై వైస్ ఛైర్మన్ తీరుపై కౌన్సిల్ లో టిడిపి కౌన్సిలర్‌లు ఫీర్యాదు చేశారు. దీనిపై టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. టిడిపి కౌన్సిలర్‌లు నిత్యం వైస్ ఛైర్మన్ ను విమర్శిస్తున్నారే తప్ప ప్రజల సమస్యలపై మాట్లాడటం లేదని వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దుకాణాల్లో సుమారు ఐదు దుకాణాలు వైస్ ఛైర్మన్ కుటుంబీకులే ఉన్నారని, వీరి వల్ల మునిసిపాలిటీకి లక్షల్లో నష్టపోతుందని టిడిపి కౌన్సిలర్లు తెలిపారు. దీంతో కౌన్సిల్ ను ముగిస్తూ ఛైర్మన్ బెల్ కొట్టి వెళ్లిపోయారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**కౌతాళం, అక్టోబర్31, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్య,సీసీ రోడ్లు, మురుగు కాలువలు తదితర సమస్యలను పరిష్కరించాలని, అందుకు సంబంధించిన నిధుల్లో జాప్యం లేకుండా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో-ఆప్షన్ ఎంబర్ మహబూబ్, వైస్ ఎంపీపీ అనిత, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## దుర్గా భోగేశ్వరుడికి కార్తీకశోభ

**– పూజలు చేసిన స్పెషల్ బ్రాంచి సీఐ**

**గడివేముల, అక్టోబర్31, ప్రభాతవార్త ;** మండలంలో దక్షిణ కాశీగా పేరుపొందిన గడిగరేవల గ్రామ సమీపాన గల శ్రీ దుర్గా భోగేశ్వరుడి ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో కార్తీకశోభ సంతరించుకుంది ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి భక్తులు పెదద సంఖ్యలో ఆలయంకు చేరుకునిభక్తి శ్రద్ధలతో శివనామ స్మరణతో దుర్గా సమేత భోగేశ్వర స్వామికి పూజలు చేశారు. స్పెషల్ బ్రాంచి సీఐ సూర్యనారాయణ దంపతులు స్వామివారికి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం వీరికి ఆలయ ఈఓ, చైర్మన్ ధర్మకర్తల మండలి సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘంసత్రంలో కాశిరెడ్డి నాయన సత్రం నందు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రాచమల్లు గోపాలయ్య, ఆలయ ధర్మకర్తలు వెంకటరమణయాదవ్, ఆలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

## నగర పంచాయతీ అభివృద్ధే ధ్యేయం

**గూడూరు, అక్టోబర్ 31 (ప్రభాతవార్త)ః** గూడూరు నగర పంచాయతీ అభివృద్దే ధ్యేయమని గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగర పంచాయతీ కారా ్యలయంలో కౌన్సిలర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా కమీషనర్ శ్రీనివాసులు నగర పంచాయతీ ఎజెండాను చదివి వినిపించారు. ఎజెండాలో జరగని పనులకు బిల్లులు చెల్లించినారని అలా ఎలా చెల్లిస్తారని కౌన్సిలర్ జ్యోతి ప్రశ్నించారు. అలాగే తమ వార్డులలలో శానిటేషన్ జరగడం లేదని , మురికి కాల్వలు పూడిక తీయడం లేదని కౌన్సిలర్లు తమ దృష్టికి తెచ్చారు. దీంతో చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాంలు మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ వార్డులలో ఏ పనులు అవసరం ఉన్నాయో వాటిని తమ దృష్ఠ ్టికి తీసుకురావాలన్నారు. అలాగే పందులు, కుక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార ్యక్రమంలో రెండవ వైస్ చైర్మన్ లక్ష్మణ్ణ,కౌన్సిలర్లు ఖలీల్ భాష, దస్తగిరి, మళ్లేశ్వరీ, ఎల్లనాగమ్మ, పద్మావతి,కలాంభాష,సురేష్, బుటంగిరి, ఖాజామున్ని, కో ఆప్ష న్‌మదార్ పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణపై హెచ్‌ఎంలకు అవగాహన సదస్సు

**పాణ్యం, అక్టోబర్31, ప్రభాతవార్త ;** ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ ఆర్.కోటయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డి.ఆర్. నారాయణ, జి.శ్రీనివాస్‌రెడ్డి, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. వీరితో పాటు సీఆర్‌పీలు శ్రీహరి, నాగరాజు, రాజశేఖర్, ఎంఐఎస్ సుభాన్, డీటీపీ శేషు, మెసెంజర్ నాగరాజు పాల్గొన్నారు. ఎంఈఓ కోటయ్య మాట్లాడుతూ సీబీఏ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అన్ని పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అయితే ఓంఎఆర్ మాత్రం కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే అందించబడుతుందన్నారు. ఈ క్వశ్చన్ పేపర్‌లను సాల్ట్ అండ్ ఎస్‌సీ ఈఆర్‌టీ ఏపీ డిజైన్ చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని గమనించాలన్నారు. నాడు, నేడు కింద చేపట్టే పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి ఎంఈఓ కోటయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## దివ్యాంగుల వాహనాలకు గడువుపెంపుపై హర్షం

**పాములపాడు ,అక్టోబరు31,ప్రభాతవార్త :** దివ్యాంగులకు మూడుచక్రాల మోటారు వాహనం దరఖాస్తు చేసుకొనేందుకు వచ్చేనెల 15వరకు గడువు పెంపుపై దివ్యాంగుల సంక్షేమసంఘం అధ్యక్షులు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.సోమవారం పాములపాడులో ఏర్పాటు చేసన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు చక్రాల వాహనల దరఖాస్తులకు సంబంధించి ఈనెల 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చువని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు మూడు చ క్రాల వాహనానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా సర్ధార్‌వల్లాభాయి పటేల్ జయంతి వేడుకలు

**పాములపాడు ,అక్టోబరు31,ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీవివేకానందవిద్యాహార్ హైస్కూల్ నందు సోమవారం భారత ఉక్కుమనిషి స్వాతంత్ర్య సమరయోధుడు సర్ధార్‌వల్లాభాయి పటేల్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. శ్రీవివేకానందవిద్యాహార్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్‌యస్ ఆర్ గోపాల్ మాట్లాడుతూ ఇంగ్లాండ్‌లో బారిష్టర్ పట్టాపుచ్చుకొని భారతదేశానికి వచ్చి ఎన్నో జాతీయ ఉధ్యమాల్లో పాల్గొని దేశాభివృద్ధికి కృసి చేశారన్నారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం దేవకి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వికలాంగుల ఆశ్రమం ధ్వంసం చేయడం దారుణం

**ఆదోని రూరల్,అక్టోబరు 31,ప్రభాతవార్త :** పట్టణంలోని 41అడుగుల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉన్న వికలాంగుల ఆశ్రమం ఆదివారం రాత్రి 12గంటల సమయంలో ధ్వంసం చేయడం దారుణమని ఆదోని డివిజన్ వికలాంగుల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ధ్వంసం చేసిన ఆశ్రమాన్ని వెంకటరెడ్డి,స్థలదాతతో పాటు పలువురు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి 12గంటల సమయంలో కబ్జాదారులు ఆశ్రమాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని ఇందుకు భాద్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు టెస్ట్ బుక్స్‌ఇవ్వండి మహాప్రభు

**ఆదోని,అక్టోబరు 31,ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ విద్యార్థులకు టెస్ట్‌బుక్స్ ఇవ్వండి మహాప్రభూ అని డిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు,జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్,డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌లు అన్నారు. సోమవారం డిఎస్ఎఫ్ ఆద్వర్యంలో గర్ల్స్ కళాశాల నుండి డివిజనల్ సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్గరకు విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మీ సమస్య వన్‌వీక్‌లో పూర్తి చేస్తామని అలాగే సమస్యను తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్ఎఫ్ నాయకులు చిరు,సుమంత్,వంశీ,ప్రభాకర్, రఘు,విశ్వనాథ్, హరికృష్ణ,విద్యార్థులు మేఘన,లక్ష్మీ,సుస్మిత,రాధిక,కవిత,రాధా తదితరులున్నారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**– ఆలూరు జడ్‌పిటిసి ఏరూరు శేఖర్**

**ఆలూరు,అక్టోబరు 31,ప్రభాతవార్త :** దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆలూరు జడ్‌పిటిసి ఏరూరు శేఖర్ అన్నారు. సోమవారం ఆలూరు పట్టణంలోని క్లబ్‌లో మొలగవలి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ అవ్వ దేవాలయ నిర్మాణానికి ఆయన రూ.10వేలు విరాళం అందచేశారు. కురుకుంద సర్పంచ్ దేవిరెడ్డి,ముద్దనగేరి సర్పంచ్ సుధాకర్‌రెడ్డి,ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఉన్నత స్థాయి ప్రమాణాలతో మెరుగైన వైద్యసేవలు

**నంద్యాల హాస్పటల్, అక్టోబరు 31, ప్రభాతవార్తః** నంద్యాల పట్టణంలో రాష్ట్రస్థాయి ఉన్నత ప్రమాణాలతో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మాక్స్‌వెల్ అసుపత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డా.రవికృష్ణ పేర్కొనా ్నరు. పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ బైపాస్‌రోడ్డులోని డా.రాజ్ కుమార్, డా.అనుషా ఏర్పాటు చేసిన మాక్ ్సవెల్ అసుపత్రిని ప్రారంభించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ అసుపత్రిలోని పలు భాగాలను శుభారంభం చేశారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఈ మ్యాక్స్‌వెల్ అసుపత్రిలో ప్రసూతి స్త్రీ విభాగాలతో పాటు జనలర్ మెడిసిన్ విభాగాన్ని అత్యవసర సేవలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యాధునిక స్థాయి పరికరాలతో నంద్యాల్లో వైద్యం అందిస్తున్నామని ఉన్నతస్థాయి ప్రమాణాలతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో ఐఎంఎ కోశాదికారి డా.ఫనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ నాయకులు డా.అనిల్ కుమార్, సీనియర్ డాక్టర్లు డా.సహదేవుడు, డాక్టర్లు నాగమణి, వసుధా, లక్ష్మీసౌజన ్యతో పాటు పట్టణానికి చెందిన వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గరుఢనంది క్షేత్రం వద్ద మహాజ్యోతి లింగార్చన

**మహానంది, అక్టోబరు 31, ప్రభాతవార్తః** ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రంలో నవనందుల్లో ఒకటైన గరుడనంది మహాజో ్యతిర్లింగార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్తికమాసం మొదటి సోమవారం సందర ్భంగా గరుడ నంది ఆలయం వద్ద శివలింగాకారంలో ప్రమిదలు పెట్టి వాటిచుట్టు పూల అలంకరణ చేసి మహాజో ్యతి లింగార్చన చేశారు. ముందుగా మధ్యాహ్నం గరుడనంది క్షేత్రం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని లక్ష్మీదేవి భజనబృందం నంద్యాల వారి అధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలయ ఇఓ చంద్రశేఖర్‌రెడ్డి హాజరై అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మతాల కులాల పేరుతో విడిపోకూడదు

**– ఐక్యతారాగాన్ని చాటిన విద్యార్థులు**

**నంద్యాల విద్య, అక్టోబరు 31, ప్రభాతవార్తః** మతాల పేరుతో, కులాల పేరుతో విడిపోకూడదని భారత రత్న సర్దార్ వల్లబాయ్ పటేల్ జన్మదిన సందర ్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలలో విద్యాసంస్థల అధినేత ప్రొఫెసర్ డా.జి.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పటేల్ జన్మదిన వేడుకల సందర ్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని జరిపారు. డా.ఉదయ్‌శంకర్, డైరెక్టర్ హేమంతరెడ్డిలు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత ్సవాన్ని ఘనంగా నిర ్వహిచారు. ఈసందర ్భంగా వారుమట్లాడుతూ విద్యార్థులు ఆయన ధైర్యసాహసాల మూలంగానే భారతావని అవిర్భవించిందని అనాటి స్ఫూర్తి నేడు కొరవడిందని నేటి సమాజంలో విద్యార్థులు అవవర్చుకోవాలని సూచించారు. దేశం ఐక్యంగా ఉండడానికి కారణం పటేల్ కారణమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం గురించి విద్యార్థ ్థలు అడిగిన పలు రకాల ప్రశ్నలకు వారు సమాధానం ఇచ్చారు. ఆయన జీవిత చరిత్ర గురించి తెలుసుకున్నారు. కలిసికట్టుగా ఉండాలని అయన సూచనాలు పాటించాలని విద్యార్థులకు బోధించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ప్రొగ్రామ్ అఫీసర్లు రమణమ్మ, కమాల్‌ఖాన్ విద్యార్థ ్థల నుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులందరిచే జాతీయ ఐక్యతా దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సబ్బయ్య, లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**వెల్దుర్తి,అక్టోబర్31,ప్రభాతవార్త ;** వెల్దుర్తి పట్టణంలో సోమవారం ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు కార్మికసంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.ఆయా కార్మికసంఘాల స్థూపాల వద్ద ఏఐటియుసి జిల్లా,మండల నాయకులు నాగమద్దయ్య,రామాంజనేయులు, యేసయ్య, మాధవస్వామి,హారిప్రసాద్,అయ్యస్వామి,కోకిల నాగరాజు,శ్రీనులు జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు ఆవిర్భవించిన ఏఐటియుసి కార్మికుల హక్కులకై పోరాటాలు చేసిందన్నారు.కార్మికులంతా ఏకమై పోరాడి హక్కులు సాధించుకోవాలని కార్మికులకు వారు కోరారు.ఈ కార్యక్రమంలో కోకిల నాగరాజు,అప్ప,బాలు,బలరాం, అమీర్,అబ్దుల్లా,వెంకటరమణగౌడ్, మహేష్,సూర్యనారాయణగౌడ్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ దేశం కోసం జీవితాన్ని త్యాగం చేశారు

**వెల్దుర్తి,అక్టోబర్31,ప్రభాతవార్త :** భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాష అన్నారు.మండల కేంద్రమైన వెల్దుర్తిలో సోమవారం ఆయన ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి విద్యార్థులతో పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఖాదర్‌బాష మాట్లాడుతూ భారత తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ నాడు వ్యవసాయం,ఆర్థికవ్యవస్థ,సైనికశక్తితో భారతదేశాన్ని బలమైన దేశంగా మార్చడంలో చేసిన కృషి సాటిలేదన్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులను శిక్షిస్తే చట్టపరంగా శిక్షార్హులే

**వెల్దుర్తి,అక్టోబర్31,ప్రభాతవార్త :** విద్యార్థులను శిక్షించిన ఉపాధ్యాయులు బాలల హక్కుల చట్టప్రకారం శి క్షార్హులే అవుతారని మండల విద్యాధికారిణి ఇందిర అన్నారు.మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని 15వ వార్డులో గల పద్మవిద్యావికాస్ ప్రైవేట్ పాఠశాలను ఆమె సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.పాఠశాలలో రికార్డులు పరిశీలించారు.మౌలికవసతులపై ఆరా తీశారు.పాఠశాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.విశాలంగా గాలి,వెలుతురు బాగా ఉండే గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి చదువు చెప్పాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఫీజులను వసూలు చేయాలని,అధిక ఫీజులు వసూలుచేస్తే చర్యలు తప్పవన్నారు.పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నారని,ఫీజులు కట్టడం లేదని,తరగతి గదిలో సరిగా వ్రాయడం లేదని,పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థులపై ఉపాధ్యాయులు చేయి చేసుకోవడం,బెత్తం వాడడం చేయరాదన్నారు.ఈ తతంగంపై విద్యార్థుల తల్లితండ్రుల నుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.విద్యార్థులను కొట్టడం,తిట్టడం,మానసికంగా వేధించడం,శిక్షలు వేయడం మానుకోవాలని హెచ్చరించారు.ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.ఇకనైనా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పద్ధతి మార్చుకోవాలన్నారు.

## ఓటీపీ అవేర్‌నెస్ పోగ్రామ్‌కు హాజరైన బీసీ ఇందిరారెడ్డి

**బనగానపల్లెరూరల్,అక్టోబర్31,ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ నందు ఓటీపీ అకాడమిక్స్ డైరెక్టర్ శ్రావణి కుమారి ఆధ్వర్యంలో అవార్డు ఫంక్షన్స్ మరియు అవేర్‌నెస్ పోగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి,రాష్ట్ర థాయ్‌బాక్సి ంగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి మరియు భాష్యం స్కూల్ వాణి హాజరయ్యారు.ముందుగా బీసీ ఇందిరారెడ్డి అక్కడికి చేరుకోగానే అకాడమిక్స్ డైరెక్టర్ శ్రావణి ఘనంగా స్వాగతం పలకగా అనంతరం బీసీ ఇందిరారెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు అవార్డులను అందజేశారు.ఈ సందర్భంగా బీసీ ఇందిరారెడ్డి మాట్లాడుతూ ఈ ఓటీపీ అకాడమిక్స్ బ్రాంచీలో బనగానపల్లెలో కూడా స్థాపించాలని దానికి అవసరమైన సహాయ సహకారాలు తాము అందిస్తామని ఆమె అన్నారు.ప్రస్తుత కాలంలో ఇంట్లో చిన్న పిల్లలు చదువుకోవాలన్న లేదా భోజనం చేయాలన్నా వారికి తప్పనిసరిగా మొబైల్ ఫోన్ ఉండాలన్నారు.ఇటువంటి వాటిని అరికట్టడానికి ఈ ఓటీపీ అకాడమిక్స్ వల్ల పిల్లలకు చదువు పై ఏకాగ్రత పెరగడమే కాకుండా మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్స్ యాజమాన్యం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గురుదాస్ గుప్తా వర్ధంతి

**పత్తికొండ,అక్టోబరు 31,ప్రభాతవార్త :** పట్టణంలో ఏఐటియుసి ఆద్వర్యంలో సోమవారం సా ్థనిక చదువుల రామయ్య భవన్ నందు ఏఐటియుసి మాజీ జాతీయ కార్యదర్శి గురుదాస్ గుప్తా 3వ వర్ధంతి జరిగింది. గురుదాస్ గుప్తా చిత్రపటానికి సిపిఐ సీనియర్ నాయకులు భీమలింగప్ప,ఏఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్ క్రిష్ణయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమలింగప్ప మాట్లాడుతూ కార్మిక చట్టాలపై నిరంతరం పార్లమెంట్‌లో ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండబెడుతూ 1992లో అప్పటి ప్రధాని పివి నరసింహరావు హయాంలో సెక్యూరిటీ కుంభకోణం,2011లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో 2జి టెలికాం స్పెక్ట్రమ్ వంటి కుంభకోణాలపై పార్లమెంట్‌లో అధికార పార్టీ భయబ్రాంతులకు బెదరకుండ ఎదురొడ్డి నిలబడి పోరాడి ఆర్థిక నేరాలను బయటపెట్టిన ధీరదత్త గురుదాస్ గుప్తా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి తాలుక అధ్యక్ష,కార్యదర్శులు బి నెట్టికంటయ్య,రంగన్న,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఆర్ గురుదాస్,సిపిఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్,ఏపి రైతుసంఘం తాలుక అధ్యక్ష,కార్యదర్శులు కె పెద్దవీరన్న,ఎం కారన్న,సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు, ఏఐటియుసి తాలుక గౌరవ అధ్యక్షులు బి మాదన్న,తాలుక డిప్యూటీ కార్యదర్శి గుండుబాషా,తాలుక ఉపాధ్యక్షులు రాజప్ప,స్కావెంజర్స్ జిల్లా నాయకురాలు సుంకమ్మ,హమాలీ నాయకులు సోమశేకర్, రంగస్వామి,పొట్ట రంగన్న,పందికోన శాఖ కార్యదర్శి కాసీం తదితరులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంత భూములను పేదలకు పంచాలి

**నందికొట్కూరు,అక్టోబర్ 31,ప్రభాతవార్త:** అన్యాక్రాంత పేదల భూములను పేదలకు పంచాలని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. సోమవారం స్తానిక జైకిసాన్ పార్కులో వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం పి.పక్కీర్‌సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భూమి కోసం భుక్తి కోసం నిరంతరం పేదల హక్కుల కోసం సంఘం పనిచేస్తుందన్నార. 1934లో అనాటి నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడు గ్రామంలో ప్రారంభించాడన్నారు.నేడు దేశ వ్యాప్తంగా సుమారు కోటి మంది సభ్యత్వం కలిగి గ్రామీణ పేదల కోసం అనేక ఉద్యమాలను వ్యవసాయ కార్మిక సంఘం పనిచేస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు,రైతు కూలీలకు వృత్తిదారులకు చెల్లించేలా కోర్టు ద్వారా పోరాటం చేసి నష్టపరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. భూమిలేని ప్రతి పేద కుటంబానికి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిశెంబర్ 15 నుండి భూ పోరాటాలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాస్కర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు పి.వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, ఎం.కర్ణ, ఓబులేషు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రైసు మిల్లులో భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**నందికొట్కూరు,అక్టోబర్ 31,ప్రభాతవార్త:** పట్టణంలోని ఓ రైసుమిల్లులో అక్రమంగా తరలించేందుకు సిద్దంగా ఉన్న దాదాపు 400 రేషన్ బస్తాలను విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. సోమవారం తెల్లవారం జామున తమకు అంధిన సమాచారం మేరకు విజిలెన్ ్స సి.ఐ.నాగరాజు యాదవ్, విజిలెన్స్ తహాసిల్దార్ తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ సమయంలో అక్కడే ఉన్న మిల్లు యజమానులు, వర్కర్లు పరారు అయ్యారని సి.ఐ. తెలిపారు. రేషన్ బియ్యంతో పాటు నాలుగు వాహనాలు, మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన లారీల డ్రైవర్లు లేకపోవడంతో వాటిని తరలించి లెక్క కట్టేందుకు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్తానిక రెవెన్యూ అధికారులు పంచనామా చేసి కేసు నమోదు పోలీసులు తెలిపారు.

## 'పౌర హక్కులపై అవగాహన కలిగి వుండాలి'

**పెట్నికోట(కొలిమిగుండ్ల), అక్టోబరు 31, ప్రభాతవార్త :** రాజ్యాంగం కల్పించిన పౌరులకు కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని కొలిమిగుండ్ల తహశీల్దార్ ధోనీఆల్‌ఫ్రెడ్, ఎస్ఐ రమేష్‌రెడ్డి పెర్కొన్నారు. సోమవారం కొలిమిగుండ్ల మండలంలోని పెట్నికోట గ్రామం ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కులు, బాధ్యతలు, చట్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ జిలానీ భాషా, విఆర్ఓ ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐటియుసి 103వ ఆవిర్భావ దినోత్సవం

**ఆస్పరి,అక్టోబరు 31,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరిలో ఏఐటియుసి 103వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి హమాలీ సంఘం అధ్యక్షులు హను మంతు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి,సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య,ఉరుకుందప్పలు పాల్గొని స్థానిక చౌరస్తా బస్టాండ్ దగ్గర ఏఐటియుసి జెండాలను ఎగురవేశారు.వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాటం చేసిన చరిత్ర ఏఐటియుసికి ఉందన్నారు. 1920అక్టోబరు 31న ముంబైనగరంలో ఆవిర్భవించిందని అప్పటి నుండి ఇప్పటివరకు కార్మికుల కోసం ముందుండి ప్రాణత్యా గానికైనా వెనుకాడకుండ కార్మిక చట్టాల కోసం ఎన్నో పోరాటాలు చేసిందని కార్మికులు పోరాడి సాధించు కున్న కార్మిక చట్టాలను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హమాలీ సంఘం కార్యదర ్శి జైపాల్, గౌరవ అధ్యక్షులు బాబు,హుసేని,బజారి, శ్రీనివాసులు,రామాంజిని, రంగన్న,గోపాల్,వీరేష్, తదితరులున్నారు.

## సబ్సీడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

**దేవనకొండ,అక్టోబరు 31,ప్రభాతవార్త :** మండలంలోని పల్లెదొడ్డి రైతుభరోసా కేంద్రంలో రబీ సీజన్‌కు సంబంధించి సబ్సీడీ కింద వేరుశనగ విత్తనాలను సోమవారం సర్పంచ్ ఉద్దే రంగస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగస్వామి మాట్లాడుతూ రాయితీ కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిఈఓ విజయలలిత మాట్లాడుతూ వేరుశనగ క్వింటం రూ.8580లకు గాను రాయితీ రూ.3432లు పోయి క్వింటానికి రైతులు రూ.5148లు చెల్లించాలన్నారు. రైతుభరోసా కేంద్రం వాలంటరీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## దొంగలు పడ్డారు బాబోయ్..!

**పత్తికొండ,అక్టోబరు 31,ప్రభాతవార్త :** డివిజన్ కేంద్రమైన పత్తికొండ పట్టణంలో దొంగలు పడడంతో ప్రజలు వారి చరాస్తులను వారే కాపలా నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీస్ వాహనాల పెట్రోలింగ్ లేకపోవడంతో ఇంటి దగ్గర ఉన్న నీటి పంపింగ్ మోటర్లు,బైక్‌లు ఇతరత్ర దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలో దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పోలీసులు మేల్కోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజలకు సంబంధించిన చరాస్తులకు రక్షణ కల్పించడంలో సత్ఫలితాలు సాధించి ప్రజాధారణ పొందాలని అప్పుడే ప్రజలలో పోలీసుల పట్ల నమ్మక భావం కల్పించిన వారవుతారన్నారు. రాత్రి పూట సమయంలో గస్తీ పోలీసులు ఉన్నట్లా..లేనట్లా..అని జరుగుతున్న దొంగతనాలకు భాద్యులు ఎవరని పోలీస్ వెహికల్ సైరన్ పగలు వినిపిస్తుంది తప్ప రాత్రి అవసరమైన సమయంలో వినిపించడం లేదని ప్రజలు గుసగుసలాడుతున్నారు. పత్తికొండ సబ్ డివిజన్‌లో ఒక డిఎస్పీ,ఇద్దరు సిఐలు,ఇద్దరు ఎస్ఐలు,ఇద్దరు ఏఎస్ఐలు,కానిస్టేబుళ్ళు, హోంగార్డులు ఉండి ఉపయోగం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

**రచ్చుమర్రి(మంత్రాలయం),అక్టోబర్ 31,ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలోని మహిళలు అన్ని రంగాలతో పాటు వ్యాపార రంగంలో కూడా రాణించాలని డిఆర్‌డిపి ట్రైనర్ ఉరుకుంద అన్నారు.సోమవారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో రిలయన్ ్స ఫౌండేషన్,ఆర్డిప్ సంస్థ,వైకెపి ఆధ్వర్యంలో పొదు పు మహిళలకు జీవనోపాధులపై శిక్షణా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమాఖ్య లీడర్లు,పొదుపు మహిళలు వైఎస్ఆర్ ఆసరా,చేయూత,కార్పొరేషన్,వ్యవసాయ అనుబంధ సంస్థలు,ఎన్ఆర్ఈజీఎస్‌లోని అవకాశాలను మహిళలు వివిధ రకాల వ్యాపారాలకు వినియోగి ంచుకొని అభివృద్ధివైపు నడవాలన్నారు.మహిళలు ఆర్థిక అక్షరాస్యతలో మెరుగు పడాలని సూచించారు. రిలయన్ ్స ఫెసిలిటేటర్ భీమేష్,రీసోర్ ్స పర ్సన్ ఉరుకుంద,పొదుపు సిబ్బంది పద్మావతి,ఆర్డిప్ సంస్థ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యను పరిష్కరించండి

**తుగ్గలి,అక్టోబరు 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పగిడిరాయి రెవెన్యూలోని సర్వేనంబర్ 177లో 1ఎకరా74సెంట్ల భూమిని అక్రమ పట్టా పాస్ పుస్తకంను రద్దుచేసి అనుభవదారులైన తమకు పట్టా పాస్‌పుస్తకం మంజూరు చేయాలని పగిడిరాయి ఎం నాగమ్మ ఆమె కుమారుడు పరమేష్‌లు తహశీల్దార్‌ను వేడుకున్నారు. సోమవారం స ్పందన కార్యక్రమంలో తహశీల్దార్‌కు భూ సంబంధ రికార్డులతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా వారసత్వంగా సంక్రమిస్తున్న తమ భూమిని రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి పత్తికొండ జయమ్మ వై/ఆఫ్ వెంకట్రాముడులు తమ పొలంపై నకిలీ పట్టా పాస్‌పుస్తకం పొందారన్నారు. తమ భూమిపై వారికి ఎలాంటి హక్కులు లేవన్నారు. తాము దాదాపు 40ఏళ్లుగా నేటికీ తాము పొలాన్ని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. దీంతో తమరు విచారించి అక్రమంగా పొందిన నకిలీ పాస్ పుస్తకాన్ని రద్దు చేసి తమకు నూతన పాస్ పుస్తకాన్ని మంజూరు చేసి ఆన్‌లైన్‌లో వారి పేర్లను తొలగించాలని తహశీల్దార్‌ను కోరారు.

## 'జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులు'

**కొలిమిగుండ్ల, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మండలంలోని అంకిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగస్వామి తెలిపారు. వివిధ విభాగాల్లో ఇటీవల బనగానపల్లె పట్టణంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంతో, జిల్లా స్థాయికి విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయ బృందం బాలసుబ్బారెడ్డి, మహమ్మద్‌షఫి, ఎల్లా సుబ్బయ్య, ఎషారాణి, రంగస్వామి, వెంకొబరావు తదితరులు అభినందించారు.

## ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్

**జూపాడుబంగ్లా , అక్టోబర్ 31 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆర్‌బిఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పిహెచ్‌సిలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. అదే విధంగా పాఠశాలలోని తరగతి గదులను, వంటగది, డైనింగ్ హాల్ పరిశీలించారు. అనంతరం ఆయన కస్తూరిబా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గంగాధర్, సిహెచ్ఓ వాహబ్, హెల్త్ సూపర్‌వైజర్లు రాముడు, విజయ లక్ష్మమ్మ, ఆరోగ్య కార్త విక్టోరియా,ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ

**మంత్రాలయం, అక్టోబర్ 31, ప్రభావతార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఉన్న శాంతిధామ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు విశ్వబ్రాహ్మణ సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఉరుకుంద, గౌరవ అధ్యక్షులు నరసింహాచారి ఆధ్వర్యంలో సోమవారం నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. నరసింహాచారి జన్మదినం సందర్భంగా వృద్ధులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు, సబ్బులు, కొబ్బరినూనె తదితర సరుకులను ప పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. వీరివెంట చందుకుమార్, మూసన్న తదితరులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఆస్పరి, అక్టోబరు 31, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి యువరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి యువరాజు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కరువయ్యాయని కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఎక్కడికి వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. అలాగే కళాశాలలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ రమణబాబు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్‌లకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శులు మల్లికార్జున, మహేష్, నాగేంద్ర, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

**గడివేముల, అక్టోబర్31, ప్రభాతవార్త ;** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (జాతీయ ఐక్యత దినోత్సవం) పురస్కరించుకుని సోమవారం నాడు ఎంపీడీఓ విజయ్ సింహారెడ్డి ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఇన్‌చార్జి హెచ్ఎం దస్తగిరమ్మ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా అధికారుల సూచనల మేరకు ఎంపీడీఓ త్రీకే రన్ ప్రారంభించారు. కొత్త బస్టాండు కూడలిలో విద్యార్థులచే జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణుడు, ఈఓపీఆర్డీ కాలిక్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు, సచివాలయ సిబ్బంది, ఇన్‌చార్జి హెచ్ఎం దస్తగిరమ్మ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి..

**ఎమ్మిగనూరు క్రైం అక్టోబర్ 31 ప్రభాతవా ర్త:** దాదాపు 35 సంవత్సరాలుగా వాల్మీకుల ను ఎస్టీలుగా గుర్తిం చాలని పోరాటాలు చేస్తూన్నా అధికారంలోకి వచ్చిన పార్టీలు వాల్మీకులను గుర్తించకుండా కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే వాడుకొని అధికారంలోకి వచ్చిన తరువాత వదిలేస్తున్నారని రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గాపురం చిన్న ఈరన్నలు ఆరోపించారు. సోమవారం స్థానిక అజంతా ఫంక్షన్ హల్ నందు వాల్మీకి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు, అగ్రవర్ణాల వారు వాల్మీకులను రాజకీయ పరంగా ఎదగకుండా అణగతొక్కుతున్నారని, రాజకీయ పరంగా ఎదిగే వాల్మీకులపై తప్పుడు కేసులు బనాయించి, రౌడీషిటర్లుగా నమోదు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నందవరం ఎస్ఐ ఒక సివిల్ భూతగాదాలోఅనవసరంగా నీవు రౌడీషిటర్ మేము చెప్పింది నీవు వినాలని దౌర్జన్యం చేసినట్లు తెలిపారు. త్వరలో ఆయనపై కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తానని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో అధిక సంఖ్యలో వాల్మీకులు ఉన్నారని, ఎమ్మిగనూరులో కూడ అధిక సంఖ్యలో వాల్మీకులు ఉన్నారని ఏ రాజకీయ పార్టీ టికెట్ ఇచ్చినా ఎమ్మెల్యేగా పోటి చేయడానికి సిద్దంగా ఉన్నానని చిన్న ఈరన్న తెలిపారు. ఈసమావేశంలో నారాయణ, కొండయ్య, శ్రీరాములు, రాజు, దుబ్బరామాంజి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

**జూపాడుబంగ్లా , అక్టోబర్ 31 ప్రభాతవార్త :** శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేందు కు ప్రతీ పట్టభద్రుడు తమ ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపిడిఓ మంజులావాణి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలో పేర్లున్న వారితోపాటు 2017 ముందు వరకు డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు కోసం పట్టభద్రులు ఫారం-18, ఉపాధ్యాయులు ఫారం-19లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టభద్రులు పట్టణ ప్రాంతాల వారైతే మున్సిపల్ కార్యాలయంలో, గ్రామీణ ప్రాంతాల వారు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. అలాగే ఆర్డీఓ కార్యాలయంలోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఆన్‌లైన్లో ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునే వారు వారి దరఖాస్తులను తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆఫ్‌లైన్లో దరఖాస్తులు చేసుకునే వారు వర్జినల్ డిగ్రీ సర్టిఫికేట్‌లతో ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓను సంప్రదించాలని వారు కోరారు. ఓటు నమోదు చేసుకునే అభ్యర్థే స్వయంగా దరఖాస్తులు అందజేయాల న్నారు. జూపాడుబంగ్లా మండలంలో ఇప్పటి వరకు 526 మంది పట్టభద్రులు ఓటు నమోదు కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్నా రన్నారు. అదే విధంగా 33 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఓటు నయోదు చేసుకునే వారు నవంబర్ 7 వతేది లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## సోలార్ పరిశ్రమ వల్ల శకునాల అభివృద్ధి కోసం వచ్చిన నిధులు ఎంత

**ఓర్వకల్, అక్టోబర్31, ప్రభాతవార్త ;** సోలార్ పరిశ్రమ వల్ల శకునాల గ్రామ అభివృద్ధి కోసం ఎన్ని నిధులు వచ్చాయో ఏ పనులకు ఎంతఖర్చు చేశారు, మిగిలిన నిధులు ఎంత అనే విషయం గ్రామ సభ ద్వారా ప్రజలకు వివరాలు తెలియజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓర్వకల్ తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బి.నాగన్న , సీపీఎం పార్టీ శకునాల శాఖ కార్యదర్శి చంద్రబాబునాయుడు పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సోలార్ పరిశ్రమ కోసం శకునాల గ్రామం నుంచి 3600 ఎకరాల భూమిని ప్రభుత్వం వారు కేటాయించాలన్నారు. శకునాల గ్రామ ప్రజల త్యాగం వల్లే సోలార్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారన్నారు. ప్రాజెక్టు వల్ల శకునాల గ్రామ అభివృద్ధి కోసం కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని, ఆ నిధులను ఏయే పనులకు ఎన్ని కోట్లు ఖర్చు చేశారనే విషయాన్ని ఏడు సంవత్సరాల కాలమైనా ఎటువంటి వివరాలు ప్రజలకు తెలియజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంపైన స్పందించి ఏయే పనులకు ఎంత డబ్బులు ఖర్చు పెట్టారు, ఇంకా ఎంత నిధులు మిగిలి ఉన్నాయనే విషయాన్ని గ్రామ సభ జరిపి ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. నాయకులు శివరాము డు, సుబ్బయ్య, ధర్మారెడ్డి, శివారెడ్డి, మదన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సర్దార్‌వల్లభాయిపటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

**వెల్దుర్తి, అక్టోబర్31, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయిపటేల్‌ను సమాజంలో ప్రతిఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ తిరివీధిసాయిప్రసాద్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం భారతదేశ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకొని సాయిప్రసాద్ గ్రంథాలయాధికారిణి కవితబాయి, కమిటీ సభ్యులు వి.యం.హరిసింహానాయుడు, జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులతో కలిసి వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కమిటీ సభ్యులు వి.యం.హారిసంహానాయుడు, ఖాదర్‌బాష,

● **నందవరం, :** మండల కేంద్రమైన నందవరంలో రాష్ట్రీయ ఏక్తాదివాస్ వేడుకలు పురష్కరించు కొని భారత దేశ మొదటి ఉప ప్రధాని సర్దార వల్లభాయ్ పటేల్ జయంతి, ఉక్కు మహిళా ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మందుగా వారి చిత్రపటాలకు పూలమాలలతో ఘనంగా నివాళ్లు అర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో నందవరం ప్రధాన పురవీధుల గుండా నినాదాలతో ర్యాలీ చేపట్టి కెనరా బ్యాంకు ముందు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నందవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ మెయిన్ పాఠశాల లక్ష్మీనారాయణ, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది ఏఓ కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, ఈరన్న, మేజర్ పంచాయితీ కార్యదర్శి రంగనాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు బోజరాజు, లచ్చప్ప, ఈరన్న, రామలింగప్ప, మద్దయ్య, భీమాచార్యులు, రామకృష్ణ, విశ్వనాథ్, శివకృష్ణయదవ్, రాందాస్, శ్రీనివాసులు, రామకృష్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

● **బండిఆత్మకూరు, :** జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివాస్) కార్యక్రమాన్ని మండల కేంద్రమైన బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భారతదేశ తొలి ఉప ప్రధాని, మొదటి హోంశాఖ మంత్రి అయినటువంటి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2014 నుంచి ప్రతి సంవత్సరం అక్టోబరు 31న పటేల్ జయంతిని పురష్కరించుకొని ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళ్లు అర్పించారు. అధికారులతో కలిసి విద్యార్థు లందరు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులందరు కలిసి 2కె రన్ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ ఉమా రాణి, విద్యాశాఖాధికారి కరిముల్లా, ప్రధానోపాధ్యాయురాలు మాధురి, పంచాయితీ సెక్రటరీ నటరాజ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

**విభజించు పాలించు విధానానికి స్వస్థిపలికి వ్యక్తి పటేల్:** పార్నపల్లె గ్రామంలో సర్పంచ్ షెక్ షబ్బీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తాదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ సిబ్బంది విద్యార్థులతో కలిసి సర్పంచ్ షబ్బీర్ అహ్మద్ 2కె రన్‌లో పాల్గొన్నారు.

● **కర్నూలు విద్య, :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురష్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ , ఎన్‌సిసి విభాగాల అధ్వర్యంలో జాతీయ ఐక్యతా ర్యాలీని నిర్వహిచారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డా.కళావతి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు జాతీయ పతాకాలను చేబూని ర్యాలీగా బయలు దేరి కళాశాల నుంచి సిక్యాంపు సర్కిల్ వరకు జాతీయ సమైక్యతను ప్రతిబింబించే నినాదాలు చేశారు. సి క్యాంపు సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. కార్య క్రమంలో కళాశాల జేఏసీ కో ఆర్డినేటర్ కెవి మధుసూధన్, వై శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్ కామ్లి నాయక్, మల్లిఖర్జున, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

● **వెలుగోడు, :** వెలుగోడు పట్టణంలో సోమవారం వెలుగోడు మేజర్ గ్రామపంచాయితీ కార్యాయంలో సర్పంచ్ వేల్పుల జయపాల్, లిటిల్ ఏంజెల్స్ పాఠశాల అవరణ కరెస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానీయేల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు నెహ్రూ యువ కేంద్ర సంఘం నూలు నాగేశ్వరరావు అధ్వర్యంలో సర్దార్ వల్లభ్ భాయి పటేల్ జయ ంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయా కార్యక్రమంలో అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1947 స్వాతంత్ర్య సమయంలో అయన పాత్ర గురించి వివరించారు.

● **పగిడ్యాల, :** భారతదేశ ప్రథమ ఉపప్ర ధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురష్కరించుకుని రన్‌ఫ ర్ యూనిట్‌లో భాగంగా పగిడ్యాల మండలంలో సోమవారం 3కే రన్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూల మాలువేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వమించారు. మండల కేంద్రమైన పగిడ్యాలలో ఎంపిడిఓ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి జెడ్పీటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరీ, ఎంపిడిఓ బివి.రమణ, ఎఇఒఆర్డి పుల్ల య్య, ఎంఇఓ సుభాన్, మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి, పరిపాలన అధికారి నాగరాజు సిబ్బంది పూలమాలువేసి నివా ళ్ళుఅర్పించారు. అనంతరం జెడ్పీపాఠశాల, మోడల్‌స్కూల్ విద్యార్థులు, కస్తూరిభా పాఠశాల విద్యార్థినీలు బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మధుసూధనరావు, అయాపాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా గ్రంథాయ అధికారిణి కె.మద్దమ్మ పటేల్ చిత్రపటానికి పూలమాలలేవుసి నివాళ్ళుర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పడమర ప్రాతకోట, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పగిడ్యాల జెడ్పీపాఠశాల, ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్దార్ వల్లబాయ్ పటేల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● **పత్తికొండ, :** భారతదేశ ఉక్కుమనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎంపిడివో కార్యాలయంలో మండల అధ్యక్షులు నారాయణదాస్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీకాంత్ చౌదరి, సీనియర్ అసిస్టెంట్ స్వర్ణలత, జూనియర్ అసిస్టెంట్ దస్తగిరి యాదవ్, ఏపీవో, ఎంపిటిసి నెట్టేకల్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది జిలాని, నాగరాజు అలాగే గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో నాగులాల్, చెన్నయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **చిప్పగిరి :** మండల కేంద్రమై న చిప్పగిరిలోని గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యోగ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి యుపి పాఠశాల విద్యార్థులతో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనను స్మరించు కున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు మరియు సచివాలయ సిబ్బంది కలిసి 2కె రన్ నిర్వహించారు.

● **అవుకు :** అవుకు పట్టణంలోని మదర్‌మోడల్ హైస్కూల్‌లో సోమవారం ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రప టానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ భారత స్వాత ం త్ర్యోద్యమంలో పాల్గొని ఎన్నో తా ్యగాలు చేసిన మహనీయుడని భారతదేశ మొట్టమొదటి ఉపప్రధాని మరియు హోంమంత్రిగా పనిచేశారని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలోని రాజ్యాలు చిన్న చిన్నగా ఏర్పడి స్వతంత్రంగా పాలన చేసుకునేవారని కాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలో చిన్న చిన్న రాజ్యాలను కలిపి అఖండ భారతవనిగా మన భారతదేశాన్ని తీర్చిదిద్దన ఘనత ఆయనకే చెందుతుందని ఆయన తెలిపారు. అందుకే ఆయనను భారతదేశ ఉక్కుమనిషి బిరుదు లభించిందని ఆయన తెలియజేశారు. అనంతరం విద్యా ్యర్థుల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్, ఉపాధ్యాయులు మద్దిలేటి, విజయ్, కిశోర్, మనోహర్, జోసఫ్, ఉపాధ్యాయునిలు సుగుణ, జ్యోతి, రామలక్ష్మి, శ్రావణి, ప్రసన్న, పుష్పావతి, మౌనిక, రామసుబ్బమ్మ, ఉషారాణి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలలితాపీఠం నందు ప్రారంభమైన మన గుడి వేడుకలు

**కర్నూలు న్యూసిటి, అక్టోబరు 31, ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక మాసం సందర్భంగా మన గుడి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శ్రీలలితా పీఠంలోని శ్రీసుందరేశ్వరస్వామి వారికి అర్చకులు మామిళ్ళపల్లి జగన్‌మోహన్ శర్మ అధ్వర్యంలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం జరిగింది. రాత్రి వై రమణమూర్తి భాగవతార్ బృందం చేసిన హరికథ గానం భక్తులను అలరించింది. ఈసందర భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కరూ ్నలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డా. మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సనాతన భారతీయ వైదిక ధర్మంలో ప్రతి పండుగకు, ప్రతిమాసానికి విశిష్టత ఉన్నదని ఆ విశిష్టతను తెలియజేయుటకే తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ప్రచార పరిషత్తు మన గుడి అనే పేరుతో సమాజంలో భక్తిభావన వ్యాప్తి చేస్తుందన్నారు. నవంబరు 1 నుంచి 7 వరకు పండితులచే కార్తీక మాస వైశిష్యంపైధార్మిక సప్తాహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతులు శ్రీగురుమేడా సుబ్రమణ్యంస్వామి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మిడుతూరులో డెంగ్యూ పరీక్షలు నిర్వహించిన వైద్యులు - వార్తకు స్పందన

**మిడుతూరు, అక్టోబర్31, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన మిడుతూరులో డాక్టర్ శివకుమార్‌గౌడ్ తన సిబ్బందితో డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. గత సోమవారం వార్త దినపత్రికలో 'మిడుతూరులో ప్రబలిన డెంగ్యూ' అనే కథనం ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన డాక్టర్ డెంగ్యూ లక్షణాలు ఇద్దరు పిల్లలకు ఉన్నాయని సమాచారంతో పరీక్షలు నిర్వహించారు. అటువంటి వ్యాధి లక్షణాలు లేవని నిర్ధారించారు. అదేవిధంగా కస్తూర్బా పాఠశాలలో 200 మంది విద్యార్థులకు నిర్వహించి పరీక్షా ఫలితాలు వచ్చాయని విద్యార్థులందరికీ ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని పరీక్షల్లో తేఇనట్లు డాక్టర్ చెప్పారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఏవైనా జ్వరాలు వస్తే వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు తీసుకోవాలని డాక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జ్యోతి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె, అక్టోబర్31, ప్రభాతవార్త:** బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కార్తీక మొదటి సోమవారం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆలయ ఈవో బి.చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ ఉమామహేశ్వర్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. క్షేత్రపాలకుడు శ్రీ వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీకదీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్న స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అరుణాచలం తరహాలో యాగంటిక్షేత్రంలో కార్తీకదీప మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్న సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. టీటీడీ దేవస్థానం వారి ఆధ్వర్యంలో లక్షదీపోత్సవ కార్యక్రమం నవంబర్ 7వ తేదిన నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నవంబర్ 7న నిర్వహించనున్న కార్తీకదీపోత్సవానికి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు యాగంటిలో మౌలిక వసతులను ఆయన ప్రధానంగా ఈవో, చైర్మన్‌లతో కలిసి పరిశీలించి వారికి తగు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల దర్శనాల వీక్షణకు తగు ఏర్పాట్లు ఎల్ఈడీ టీవీలను వేదికను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్తీక మొదటి సోమవారం పురస్కరించుకుని యాగంటి క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుండి భక్తులు యాగంటి పెద్దకోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించి శ్రీ ఉమామహేశ్వర్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో, చైర్మన్ తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ రాజగోపురం ముందు గల జ్యోతిస్తంభం వద్ద భక్తులు కార్తీకదీపం వెలిగించారు. భక్తులు యాగంటిలో శ్రీ ఉమామహేశ్వర్లు, ఇతర ఉప ఆలయాలు, చిన్నకోనేరు, పెద్దకోనేరు, గుహలయాలను సందర్శించారు. అక్కడ నిర్వహించబడుతున్నసత్రాలలోభోజనాదులను స్వీకరించారు.

## పేదలందరికీ సంక్షేమ పథకాలు ; ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిలీగల్, అక్టోబర్31, ప్రభాతవార్త ; పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇంటి వద్దకే వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి పందుతున్నారన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు పెద్ద శక్తిగుడి ఏరియాలో కార్యక్రమాన్ని చేపట్టారు. 148 గడపలను ఎమ్మెల్యే సందర్శించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వార్డు, సచివాలయాల్లో పనిచేసు ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. వార్డుల్లో తాగునీటి సరఫరా, మురుగు కాలువలు, రోడ్లు, వీధి దీపాలు, హై ఓల్టేజీ సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకొస్తే త్వరలోనే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. అవినీతిరహిత రాష్ట్రంగా మార్చేందుకు గానూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేవారికి వారి ఖాతాల్లోనే నేరుగా నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నూతన పద్ధతులతో ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికలు పాదయాత్రలో ఇచ్చిన హామీలను నేటికీ వందశాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాలు కురవక రైతులు కరువు కాటకాలతో ఇబ్బందులు పడేవారన్నారు. అయితే నేడు వర్షాలు సంవృద్ధిగా కురుస్తున్నాయని, పంటలు బాగా పండుతున్నాయని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. రైతులను అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. పేదల కోసం ప్రత్యేకంగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలాలు, ఇళ్లను మంజూరు చేసి నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డా.మధుసూదన్, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, రేణుక, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, మురళీరెడ్డి, కౌన్సిలర్లు, ఇన్‌చార్జి సురేష్‌కిషోర్, దుర్గప్ప, బీటీ లక్ష్మన్న, వి.కె.వెంకటేష్, తాయన్న, మలేకర్ గోవిందు, నాగరాజు, సింహం నాగేంద్ర, రమేష్‌యాదవ్, దస్తగిరి, జైపాల్, ఆనంద్, లక్ష్మినారాయణ, అంజి, రఘు, మిలిటరీ ఆంజనేయ, సుధాకర్, విజయ్, ఆబు వెంకటేష్, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులే పాలకులైతే - ప్రజలు బిక్షగాళ్లు అవుతారు

### -నకిలీ సీడ్స్‌పై అధికారులను నిర్భందించిన సిపిఐ నాయకులు

**నంద్యాల, అక్టోబరు 31, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలో నకిలీ సీడ్స్‌తో రైతులు అత్మహత్యలు చేసుకుంటున్నా అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని సిపిఐ నాయకులు వ్యవసాయ కార్యాలయం ముందు అధికారులను నిర్భందించారు. వ్యాపారులు పాలకులు అయితే ప్రజలు బిక్షగాళ్లు అవుతారని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్యాలయాన్ని ముట్టడించారు. రైతులు అత్మహత్యచేసుకుంటున్నట్లు వినూత్న నిరసన తెలిపారు. నకిలీ విత్తనాలు అరికట్టడంలో వైఫల్యంచెందిన వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలని, నకిలీ విత్తనాల కంపెనీలపై క్రిమినల్ కేసులునమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయానికి తాళాలు వేసి అధికారులను బయటకు పంపారు. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీతో బయలుదేరి నకిలీలను అరికట్టెందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షులు సుబ్బరాయుడులు పేర్కొన్నారు. ఓ రాజకీయ నాయకుడి ప్రమేయంతో నంద్యాల జిల్లాలో నకిలీ విత్తనాలకు అడ్డాగా మారిందని అరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోస్పాడు, పాణ్యం, ఆళ్లగడ్డ, డోన్, మండలాలకు చెందిన రైతులు నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ ఎడిఎ రాజశేఖర్‌ను జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావులను నిర్భందించారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, బాస్కర్, సామేల్, హరినాథ్, శ్రీనివాసులు, సుగుణమ్మ, శివయ్య, ధనుంజయ, సురేష్, ఏర్విస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఇందిరమ్మ....

### డిసిసి అధ్యక్షులు సుధాకర్ బాబు....

**కర్నూలు క్రైమ్, అక్టోబర్, 31, ప్రభాతవార్త :-** భారత తొలి మహిళా ప్రధాన మంత్రి ప్రపంచ ఉకు ్క మహిళగా పేరుగాంచిన భారతరత్న ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో ప్రతి ఇల్లూ ఆనందంగా ఉండెదని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిందని కర్నూలు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యం సుధాకర్ బాబు ఆమె సేవలను కొనియాడారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఇందిరా గాంధీ 38 వర్ధంతి మరియు భారత తొలి ఉపప్రధాని ఉకు ్క మనిషి సిర్ధార్ వల్లబాయ్ పటేల్ 147వ జయంతి సందర్భంగా వారి చిత్రపటాములకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీమతి ఇందిరా గాంధీ పాలనలో దేశంలో ప్రజలు ఎంతో సుఖ సంతోషాలతో జీవించారని ఆమె గరీబీ హటావో బ్యాంకుల జాతీయకరణ రాజ భరణాల రద్దు అంటారానిత నిర్మూలన మొదలుగు ఎన్నో సాహసోపేత నిర్ణయాలను అమలు పరిచి దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని ఎన్నో జాతీయ సంస్థలు స్థాపించిందని ఆయన తెలిపారు. నేడు మోడీ ప్రభుత్వంలో దేశప్రజలు పెరిగిన నిత్యావసర ధరలు వంటగ్యాస్ పెట్రోల్ ధరలతో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నేడు ప్రధాని మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ అదానీలకు ప్రైవేటు పరం చేసి పేదల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాడని విమర్శించారు. అలాగే భారత మొదటి ఉపప్రధాని మొదటి హోం మంత్రి సర్ధార్ వల్లబాయ్ పటెల్ స్వాతంత్ర్య సమరయోధుడుగా 1931 సంవత్సరంలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహా సభకు అధ్యక్షత వహించారని సాహసాపేత నిర్ణయాలతో ఐదువందలకు పైగా స్వదేశీ సంస్థానాలను విలినం చేసి స్వతంత్ర భారతావనిని ఏకం చేసి ధీశాలి సర్దార్ వల్లబాయ్ పటెల్ ని ఆయన పుట్టిన రోజున జాతీయ ఐక్యతాదినంగా జగుపుకుంటున్నామని సుధాకర్ బాబు తెలియజేశారు. అనంతరం స్థానిక రాజ్ విహార్ సెంటర్ నందలి క్యాంస విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ డిసిసి ఉపాధ్యక్షులు కె.పెద్దారెడ్డి పీసీసీ ప్రధాన క్యాదర్శి పి హరి కుమార్ రాజు పిసిసి అధికార ప్రతినిధి ఏ కరుణకర్ బాబు జిల్లా ఐఎన్టీయుసి అధ్యక్షుడు బి బతుకన్న కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ గుప్త సు ంకన్న సుబ్రమణ్యం వెంకటలక్ష్మీ మద్దమ్మ ఎల్లమ్మ మొదలగు వారు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించేలా చూడాలి

**కౌతాళం, అక్టోబర్31, ప్రభాతవార్త ;** తుంగభద్ర డ్యాం ఎల్లెల్సీ కాలువ మోకా తాలూకా దగ్గర ఉన్న బరదనహాల్ వద్ద వంతెన పిల్లర్ కూలడం వల్ల దిగువనున్న ఆయకట్టు రైతులకు నీరు రాకపోవడంతో చాలా ఇబ్బందిగా మారిందని రైతులు కురుబ వీరేష్, విజయ్, బసవ, చంటి, కృష్ణయ్య, గిరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువ నీరు కొరకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలు ఆశలూవిరి అయ్యాయి. కౌతాళం మండలంలో వరి, మిరప పంటలు వేసుకున్న రైతులు కాలువలకు నీరు లేక రైతన్నలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటునానరు. ఎంతో కష్టపడి పండించిన రైతు పంట చేతికి వచ్చే సమయంలో వరి, మిరప పంటలకు కాలువకు నీరు లేక చాలా నష్టాన్ని కలిగించింది. గత కొద్ది రోజులుగా అధిక వర్షాలు వల్ల పంటలు దెబ్బతిన్నాయి. తుంగభద్ర డ్యాం ఎల్లెల్సీ కాలువ బారదనహాల్ వద్ద 9 నుంచి 15 పిల్లర్ డామేజ్ అయ్యాయి. అధికారులు ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎల్లెల్సీ కాలువ వంతెనలు అధికారులు సరిగా పర్యవేక్షించకపోవడంతో ఊసుకోలేనందున ఇందులో నష్టపోయేది రైతులు కావునా అధికారులు స్పందించి నిర్లక్ష్యం చేసిన సదరు అధికారిపై చర్య తీసుకుని వీలైనంత త్వరగా కాలువ వంతెన ఏర్పాటు చేసి రైతులకు నీరు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు రైతులు కురుబ వీరేష్, విజయ్, బసవ, చంటి, కృష్ణయ్య, గిరి అందజేశారు.

## పరిపాలనా వికేంద్రీకరణతోనే సీ సస్యశ్యామలం

**పాణ్యం, అక్టోబర్31, ప్రభాతవార్త ;** శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తేనే రాయలసీమకు పూర్వ వైభవం వస్తుందని, మూడు రాజధానులు ముద్దు, ఒకే రాజధానివద్దు అనే నినాదంతో రాయలసీమ విద్యార్థి, యువజనసంగాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారంనాడు పాణ్యంలో రాయలసీమ ఆత్మగౌరవ పేరుతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాణ్యం బస్టాండులో నాలుగు రోడ్లకూడలిలో ఆనవహారంగా ఏర్పడి మూడురాజధానులు కావాలని పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నేతలు రవీంద్రనాథ్, బత్తిని ప్రతాప్, వేణు, మాధవరెడ్డి, కేజే శ్రీనివాసరావు, బాలకృష్ణ నాయక్ తదితరులు మాట్లాడుతూ తరతరాలుగా సీమకు జరుగుతున్న అన్యాయం ఇక సహించమని, పరిపాలన వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ పేరుతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే దీనిని కొంతమంది కుట్రపూరితంగా అడ్డుకుంటున్నారన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు అన్ని పార్టీలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలోనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి తాళలేక యువకుడు మృతి

**పాములపాడు రూరల్, అక్టోబరు31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రగూడూరు గ్రామానికి చెందిన తిరుపాటి కిరణ్(31) అనే యువకుడు మృతి చెందారు. ఏఎస్ఐ జోసఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 29న కిరణ్ కడుపునొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది పురుగులమందు సేవించాడని తెలిపారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకవెళ్లాగా సోమవారం మృతిచెందారని ఏఎస్ఐ పేర్కొన్నారు. మృతుని తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకుకేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతునికి భార్యతోపాటు కూతురు ఉన్నారు.

## బిఎస్ఎన్ఎల్‌లో విజిలెన్స్ వారోత్సవాలు

**కరూ ్నలు మున్సిపాలిటి, అక్టోబరు 31, ప్రభాతవార్త:** వినియోగదా రులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో అక్టోబరు 31వ తేది నుంచి నవంబరు 6వ తేది వరకు భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కర్నూ లు బిజినెస్ ఏరియా మేనేజర్ శ్రీ జి రమేష్ తెలిపారు. ఈసం దర ్భంగా జనరల్ మేనేజర్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి కొరకు అవినీతి లేని భారత్ నినాదంతో ప్రతి ఉద్యోగి దైనందిన కార్యక్రమంలో న్యాయపరమైన విధానాలకు కట్టుబడి లంచం ఇవ్వడం కానీ, తీసుకోవడం కానీ జరగకుండా వ్యక్తిత్వ వికాసంతో ఒక ఉదాహరణగా నిలిచి ఏదైనా అవినీతి జరిగింది అన్నప్పుడు తగిన విజిలెన్స్ ఏజెన్సీలకు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ డి ఈ జి మహేంద్ర, ఇతర ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## హంద్రీనీవా ద్వారా రైతులకు సాగునీరు అందించాలి

### - మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



రాస్తారోకోలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ, టిడిపి నాయకులు

**దేవనకొండ, అక్టోబరు 31, ప్రభాతవార్త :** హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వార మండలంలో రైతులకు 46వేల ఎకరాలకు సాగునీరు అందించే వరకు టిడిపి ఆధ్వర్యంలో రైతులకు కలిసి పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే, ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన దేవనకొండ తెదేపా కార్యాలయం నుండి టిడిపి శ్రేణులతో ప్రధాన రహదారి గుండా ఆమె ర్యాలీగా తరలివచ్చి పత్తికొండ-కర్నూలు రహదారిపై రాస్తారోకో కార్యక్రమాన్ని మండల టిడిపి కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానుద్దేశించి ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. సంక్షేమ పథకాలు తప్ప అభివృద్ధి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి విద్యుత్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో సాగునీరు సరఫరా కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం విద్యుత్ బకాయిలు చెల్లించి తక్షణమే సాగునీరందించాలని డిమాండ్ చేశారు. గత టిడిపి ప్రభుత్వంలో రైతులకు అన్ని రకాల వ్యవసాయ పరికరాలు, బిందు సేద్య పరికరాలు రాయితీపై అందించేవారని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం వాటిని విస్మరించడం జరిగిందన్నారు. అనంతరం గుండ్లకొండ గ్రామ శివారులోని హంద్రీనీవా ఎత్తిపోతల పథకాన్ని ఆమె పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.30వేలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, రామదాసుగౌడ్, రామారావు నాయుడు, మల్లయ్య, మాలిక్‌భాష, మల్లికార్జునగౌడ్, ఎంపిటిసి తిమ్మప్ప, సర్పంచ్‌లు భాస్కర్, మహేశ్వరరెడ్డి, హనుమంతు, ఆకుల వీరేష్ , జనార్ధన్‌రెడ్డి, వెంకట స్వామి గౌడ్, చిన్నపటేల్, సుధాకర్‌రెడ్డి, బండ్లయ్య, రాజాసాహెబ్, నాగేష్, లతీఫ్, మస్తాన్, పెద్దయ్య, చెన్నకేశవులు, కృష్ణ, కౌలుట్ల, రాజగోపాల్‌గౌడ్, సుంకన్న, కాశీమన్న, తిమ్ములు, మునిరంగడు, బాలు, రామాంజనేయు లు, వెంకటేష్ తదిత రులున్నారు.

**CHANGE OF NAME**

I, KASIREDDY SREEKAR (Old Name) R/o.B10, Sreenilayam River View Villas, Sunkesula Road, Mamidalapadu, Kurnool Dist, AP., have changed my name as **KASI REDDY SREEKAR REDDY** (New Name) S/o KASI REDDY SREENIVASA REDDY.

(TH KNL)

